క్లుప్తంగా

భువనేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో భీమిలి ఎంపీపీ వాసురాజు తదితరులు

తగరపువలస: భీమిలి మండలం బోడమెట్టపాలెంలోని భువనేశ్వరి మాత ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చండీహోమం, పాలాభిషేకం, అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాల్లో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు దంపతులు, సర్పంచ్‌లు ముద్దాడ అప్పయ్యమ్మ, పొట్నూరు ఛాయాగౌతమి, గాడు వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, ముద్దాడ సూరప్పడు, కేవీ రమణ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా వారాంతపు పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన తర్వాత పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


నిలిచిన చేపల వేట

కొమ్మాది: తీరంలో మిచాంగ్ తుఫాన్ తీవ్రంగా మారనున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేట నిలిపివేశారు. భీమిలి, ఉప్పాడ, మంగమారిపేట, రుషికొండ, తిమ్మాపురం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు ఆదివారం వేటకు వెళ్లలేదు. ఇప్పటికే మత్స్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు పడవలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా కార్తీక మాసం పిక్నిక్ సీజన్ అయినప్పటికీ తీర ప్రాంత పర్యాటక ప్రాంతాల్లో తుఫాన్ ఆందోళనలతో పర్యాటకుల సంఖ్య తగ్గింది.

భగవంతునిపై విశ్వాసం అవసరం

భీమునిపట్నం: భగవంతుడు అందరికీ ఒక్కరేనని, ఆయనపట్ల ప్రతి ఒక్కరూ విశ్వాసం కలిగి ఉండాలని విశాఖకు చెందిన సంత్ నిరంకార మండలి ప్రతినిధి దేవి అన్నారు. కృష్ణాకాలనీలో భక్తులతో ఆదివారం నిర్వహించిన సంత్ సమాగంలో ఆమె పాల్గొన్నారు. మానవ జన్మ ఎంతో అమూల్యమైనదని, దాన్ని ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అందరి పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉంటే అంతా మంచి జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సరైన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. 98 మంది రోగులను వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ పరీక్షించి మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.చంద్రశేఖరరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు లక్ష్మణరావు, రాంబాబు, శంకర్ పాల్గొన్నారు.

జలసిరి



శ్రీనగర్‌లో ఏర్పాటు చేసిన బోరుబావి



తగరపువలస షాదీఖానా ఆవరణలో బోరుబావి



ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన బోరుబావి



ఇది కదా అభివృద్ధి



వేంకటేశ్వరమెట్టపై రూ.19.62 లక్షలతో మరమ్మతులు చేపట్టిన భగీరథ వాటర్ ట్యాంక్

- పంప్‌హౌస్‌ల ఆధునికీకరణ, మోటార్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం
- రూ.1.27 కోట్లతో 350 ఎంఎం జీఆర్‌పీ పైప్‌లైన్ నిర్మాణానికి చర్యలు

తగరపువలస: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు 2019 వరకు జీవీఎంసీ భీమిలి జోన్ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజలకు తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత కల్పించారు. ఎప్పటికప్పుడు పైప్‌లైన్ల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నారు. పంప్‌హౌస్‌లు, మోటార్లు, కృత్రిమ రిజర్వాయర్లను ఆధునికీకరిస్తున్నారు. భీమిలి జోన్‌లోని 75 వేల మంది ప్రజల తాగునీటి అవసరాలకు గోస్తనీనదిలో పద్మనాభం మండలం సామియ్యవలస, భీమిలి మండలం టి.నగరపాలెం, తగరపువలస వద్ద మొత్తం 8 ఊటబావులు, 2 బోర్ల నుంచి రోజూ నీటిని సేకరిస్తున్నారు. ఈ నీటిని వెంకటేశ్వరమెట్ట వద్ద గల 1800 కేఎల్ భగీరథ వాటర్ ట్యాంకు, కొండపేట పంప్‌హౌస్ వద్ద 680 కేఎల్, నమ్మివానిపేట వద్ద 150 కేఎల్, కృష్ణాకాలనీలోని 800 కేఎల్, భీమిలి పాత ట్యాంకు 450 కేఎల్ సామర్థ్యం కలిగిన కృత్రిమ రిజర్వాయర్ల ద్వారా రోజూ బురద శాతం, క్లోరిన్ పరీక్షలు జరిపి సురక్షిత నీటిని సరఫరా చేస్తున్నారు. తరచూ పగిలిపోతున్న పైప్‌లైన్‌కు ప్రత్యామ్నాయంగా మరిన్ని నాణ్యమైన సేవలలో భాగంగా తగరపువలస నుంచి భీమిలి వరకు రూ.1.27 కోట్లతో 350 ఎంఎం జీఆర్‌పీ పైప్‌లైన్ నిర్మాణం ప్రారంభం కానుంది.



కొండపేట పంప్‌హౌస్ వద్ద మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

- 2020 – 21 వేసవిలో భీమిలి జోన్‌లో రూ.19.50 లక్షలతో 20 కొత్త బోరుబావులు ఏర్పాటు చేశారు.
- కుమ్మరిపాలెంలో రూ.2.35 లక్షలతో వాటర్ పైలట్ వాటర్ స్కీమ్ పూర్తి చేశారు.
- ఇటీవల జీవీఎంసీ 1, 2 వార్డుల్లో 30 బోరుబావులు రూ.22.40 లక్షలతో ఏర్పాటు చేశారు.
- జీవీఎంసీ 3, 4 వార్డుల్లో 20 బోరుబావులు రూ.17.60 లక్షలతో ఏర్పాటు చేశారు.
- రూ.1.27 కోట్లతో తగరపువలస నుంచి భీమిలి వరకు 350 ఎంఎం వ్యాసార్థం కలిగిన జీఆర్‌పీ పైప్‌లైన్ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి.
- పీడబ్ల్యూఎస్ పథకం కింద రూ.10.15 లక్షలతో రెండు పైలట్ వాటర్ స్కీమ్ పనులు ప్రారంభమయ్యాయి.
- రూ.9.30 లక్షలతో నాలుగు వాటర్ సప్లయ్ ట్యాంకుల నిర్మాణం ప్రారంభమయింది.
- రూ.7.86 లక్షలతో కృత్రిమ రిజర్వాయర్ వద్ద సిబ్బందికి గది నిర్మాణం ప్రారంభమయింది.
- కె.నగరపాలెం వద్ద రూ.19.60 లక్షలతో పైప్‌లైన్ మార్పిడి పనుల టెండర్ పూర్తయింది.
- వెంకటేశ్వరమెట్ట వద్ద భగీరథ వాటర్ ట్యాంక్‌ను రూ.28.47 లక్షలతో ఆధునికీకరించారు.
- రూ.12 లక్షలతో జోన్‌లో బోరుబావులకు మరమ్మతులు చేపట్టారు.

నిరంతరం తాగునీటి సరఫరా

ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, గోస్తనీ నదికి వరదలు వచ్చినప్పుడు యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సరఫరా పనులు పునరుద్ధరణ చేసే సిబ్బంది భీమిలి జోన్‌లో ఉన్నారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటి సమస్యను తీర్చే యంత్రాంగం ఉంది. నిర్ణీత సమయంలో రిజరాయర్లను శుభ్రం చేయడం, మరమ్మతులు పూర్తి చేయడం, పైపులైన్‌లో మురుగునీరు చేరకుండా స్కవర్ పనులు చేస్తుంటారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోరుబావులు కొత్తవి ఏర్పాటు, పాతవాటికి మరమ్మతులు చేస్తున్నారు.



బంతాట మైదానం వద్ద బోరుబావి

సురక్షిత తాగునీరు సరఫరా



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. అందులో భాగంగా సురక్షితమైన తాగునీరు అందిస్తున్నారు. ఇంకా వివిధ కంపెనీల భాగస్వామ్యంతో వాటి సీఎస్ఆర్ నిధుల నుంచి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. – తమ్మిన శ్రీను, తగరపువలస

రోజూ సరఫరా చేస్తున్నారు



ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రజలు ఇబ్బంది పడకుండా నిత్యం తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎప్పుడైనా సరఫరాకు అంతరాయం కలిగితే వాటర్ టాంకర్ల ద్వారా పంపిస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం తాగునీటికి అధిక ప్రాధాన్యమిస్తోంది. – ఉండవిల్లి అప్పారావు, చిట్టివలస

గతంలో చాలా ఇబ్బంది పడ్డాం



గత ప్రభుత్వాల హయాంలో గోస్తనీనది ఏడాదిలో నాలుగు మాసాలు ఎండిపోయేది. సీఎం జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వర్షాలు కూడా సమృద్ధిగా కురిశాయి. ఇప్పటికీ గోస్తనీనది నిండు కుండలా ఉంది. తాగునీటి సమస్య లేదు. – మేకల శ్రీనివాస్, మాజీ సైనికుడు, కొత్తపేట

ప్రత్యేక డ్రైవ్‌లో చురుగ్గా ఓటర్ల నమోదు



సంతపేట జీవీఎంసీ హైస్కూల్‌లో బీఎల్వో, సిబ్బంది



మారికవలస ఆర్‌జీకే కాలనీలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న బీఎల్‌వో, నాయకులు

తగరపువలస: భారత ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఈ నెల 2, 3న ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణల కోసం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ చురుగ్గా సాగింది. భీమిలి పరిధిలోని ఓటర్లకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది ప్రజలకు సేవలు అందించారు. పలువురు ఓటర్ జాబితాను పరిశీలించి తమ ఓట్లు ఉన్నాయో... లేవోనని చూసుకున్నారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా నమోదు, చిరునామా మారిన వారు సవరణలు, మరణించిన ఓటర్ల తొలగింపు కోసం కుటుంబ సభ్యులు స్వచ్ఛంగా వచ్చి పరిశీలిన చేసి సిబ్బందికి సహకరించారు. చాలా వరకు కొత్తగా ఓటర్ నమోదును ఆన్‌లైన్‌లో చేసుకోగా సచివాలయ సిబ్బంది, బీఎల్వోలు ఇంటింటా సర్వేలో భాగంగా కొంత ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిసింది. ఆయా పార్టీల రాజకీయ నాయకులు బూత్‌లను సందర్శించి డ్రైవ్‌ను పరిశీలించారు. నమోదు, తొలగింపు, సవరణల గురించి సిబ్బందిని ఆరా తీశారు.

మధురవాడ: ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధురవాడలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రాల వద్ద బీఎల్‌వోలు, అసిస్టెంట్ బీఎల్‌వోలు జాబితాలు పరిశీలించి, సవరణ చేశారు. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్, మారికవలస, వాంబే కాలనీ, స్వతంత్రనగర్ పాఠశాలలు, ఇతర పోలింగ్ కేంద్రాలు వద్ద ప్రత్యేక సవరణ, ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టారు.

ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ రిఫరీకి సన్మానం

తగరపువలస: ఇటీవల పోర్చుగల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో భారత్ తరఫున అఫీషియల్ రిఫరీగా పాల్గొన్న నగరానికి చెందిన జి.ఆనందబాలును తగరపువలసకు చెందిన పీఎస్ఆర్ కిక్ బాక్సింగ్ కోచ్ బంగారు పరదేశి సత్కరించారు. ఈ సందర్భంగా పరదేశి మాట్లాడుతూ గత నెల 6న ఆనందబాలు ప్రపంచ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కూడా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ అండ్ కోచ్ పి.నరసింహారావు, మరో కోచ్ జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఈ నెల 9, 10న పుదుచ్చేరిలో జరగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు పీఎస్ఆర్ కిక్ బాక్సింగ్ ఇన్‌స్టిట్యూట్ తరఫున 15 మంది హాజరవుతారన్నారు. వీరిలో తగరపువలసకు చెందిన ఇద్దరున్నట్టు తెలిపారు. అలాగే తగరపువలసకు చెందిన కొల్లి సన్ని బ్లాక్ బెల్ట్ సాధించారని తెలిపారు.



రిఫరీ ఆనందబాలును సన్మానిస్తున్న కోచ్ పరదేశి, తదితరులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంతంపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. భగవద్గీత గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేశారు. గుడిలోకి ప్రవేశించేవారు ధ్వజ స్తంభ దీపం వద్దకు వచ్చే సరికి దైవ ధ్యాసలో ఉండాలని సూచించారు. కార్తీక మాసం డిసెంబర్ 12 వరకు ఉంటుందని, అందరూ కార్తీక దీపారాధన చేయాలన్నారు. ఎంపీపీ కంటుభోతు రాంబాబు, మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, కాళ్ల నగేష్ కుమార్‌కు ప్రబోధ సేవా సమితి గ్రంథాలను అందజేశారు. కార్యక్రమంలో కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, ఎస్.శ్రీనివాస్, వి.భవానీ, కె.లక్ష్మి, కె.రాజు పాల్గొన్నారు.



ఎంపీపీ రాంబాబుకు భగవద్గీత అందజేస్తున్న సభ్యులు

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేత

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ బొగ్గురోడ్డు – 1 వార్డు సచివాలయం పరిధిలో పెన్షన్‌దారుడు రంగూరి రామచంద్రరావుకు వలంటీర్ బూసరి జగదీశ్వరి ఆదివారం విజయనగరం మహారాజా ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదు అందించింది. చిట్టివలస కార్మికవాడకు చెందిన ఆయన ఇటీవల అనారోగ్యం కారణంగా అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు ఆమె తెలిపింది.



విజయనగరం మహారాజా ఆస్పత్రిలో రామచంద్రరావుకు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ జగదీశ్వరి

జస్వంత్ రెడీమేడ్స్ యాజమాన్యానికి సాయం



సాయం అందిస్తున్న శ్రీ ఉమామహేశ్వర దేవాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

తగరపువలస: స్థానిక జస్వంత్ రెడీమేడ్స్ యజమాని కటకం సునీతకు ఆదివారం శ్రీ ఉమా మహేశ్వర దేవాంగుల సంక్షేమ సేవా సంఘం రూ.లక్ష సాయం అందించింది. గత నెల 26న జరిగిన అగ్నిప్రమాదంలో రెడీమేడ్స్ దుకాణం కాలిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బాధితులకు సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేవీ సూర్యారావు, అధ్యక్షుడు అలంక సాంబమూర్తి, అప్పలరాజు, శ్రీనివాస్, కార్యదర్శులు తవుడుబాబు, కొండపల్లి వెంకటరావు, లక్ష్మణరావు, కోశాధికారి అప్పలరాజు, భవానీ ప్రసాద్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి ఆర్థిక సాయం



లక్ష్మీపురంలో అన్నదానం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్‌రావు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం శ్రీఅయ్యప్పస్వామి సేవాపీఠంలో నిత్యాన్నదాన పథకానికి చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. సుమారు 800 మంది అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భవానీలు అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం మురళీమోహన్‌రావు కుటుంబ సభ్యులను పీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు సత్కరించారు.

బీఎస్‌ఎఫ్ విశ్రాంత సైనికునికి వీడ్కోలు



రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు పలుకుతున్న భీమిలి మాజీ సైనికులు

తగరపువలస: బీఎస్‌ఎఫ్‌లో ఏఎస్ఐ కేడర్‌లో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన సైనికుడు చంద్రకుమార్‌కు భీమిలికి చెందిన మాజీ సైనికులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఢిల్లీ నుంచి విశాఖ మీదుగా విజయవాడ వెళ్తున్న ఆయనను రైల్వే స్టేషన్‌లో కలిశారు. తెలుగు భద్రతా సరిహద్దు దళం బ్రేవోహార్ట్స్ సభ్యుడైన చంద్రకుమార్ బోర్డర్‌లో ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయనను సరగడ చిట్టిబాబు, డొప్పా సత్యనారాయణ, శ్రీనివాసరావు, పాపునాయుడు, బుధుడు, వై.అప్పలరెడ్డి, ఎస్.నరసింహారావు తదితరులు సన్మానించారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి

తగరపువలస: భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు, మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఆదివారం విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ 1950లో రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన రాజేంద్రప్రసాద్ రెండో సారి కూడా సేవలు అందించారన్నారు. విద్యార్థి దశ నుంచే నిరాడంబర జీవితం గడిపిన ఆయన విశేష ప్రతిభాపాటవాలను ప్రదర్శించారన్నారు. న్యాయవాదిగా, జర్నలిస్ట్‌గా, స్వాతంత్ర సమరయోధునిగా కూడా పనిచేసి అఖిల భారత కాంగ్రెస్‌లో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజుతో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, తదితరులు

వరి కోతలు కోయొద్దు

పద్మనాభం: తుఫాన్ ప్రభావం తగ్గేంత వరకు రైతులు వరి కోతలు కోయవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం సూచించారు. మండలంలోని కృష్ణాపురం గ్రామాన్ని ఆదివారం ఆయన సందర్శించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవీఎస్ చలం మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తగ్గిన తర్వాత మాత్రమే వరి కోతలు కోయాలని సూచించారు. ఇప్పటికే వరి పంట కోసిన వారు పనలను కుప్పలుగా పెట్టుకోవాలన్నారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కరెంటు తీగలు తెగి పడే అవకాశమున్నందున రైతులు పొలాల్లోకి వెళ్ల కూడదని తెలిపారు. వర్షం వచ్చి వరి పనలు తడిస్తే ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.



కృష్ణాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ఎంవీఎస్ చలం

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

మధురవాడ: క్రమశిక్షణతో బీజేపీ విధానాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ విశాఖ పార్లమెంటరీ జనరల్ సెక్రటరీ దిలీప్ వర్మ, భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు చెప్పారు. మిథిలాపురి వుడా కాలనీలో ఇటీవల నియమించిన 8వ వార్డు కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీజేపీ విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వార్డు అధ్యక్షుడు ప్రసాద్, సెక్రటరీ డాక్టర్ బి.మృత్యుంజయరావు, మరో సెక్రటరీ అప్పారావును అభినందించారు. వార్డు ఇన్‌చార్జి వాసుపల్లి శ్రీహరి, మాధవ్, కె.ధనుంజయనాయుడు, సురేంద్ర కుమార్, ఏకే సింగ్, సునీత తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీతో జిల్లా నాయకులు

హక్కుల కోసం పోరాటం తప్పనిసరి

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేయక తప్పదని విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బగాది శ్రీనివాసరావు, సీఐటీయూ మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్ అన్నారు. కొమ్మాది జంక్షన్‌లో సీఐటీయూ అనుబంధ శ్రీ కృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘం జెండాను సంఘ అధ్యక్షుడు అవాల లక్ష్మణరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాల విధానాల వల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు, సంఘ గౌరవ అధ్యక్షుడు నీలయ్య, పి.లక్ష్మణ, కె.రమణ, రాము, ఎం.కంచయ్య తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాది జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

దివ్యాంగులకు ఆత్మస్థైర్యం అవసరం

కొమ్మాది: దివ్యాంగులకు ప్రతి విషయంలోనూ ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని పూర్ణమిదం ఆర్గనైజేషన్ ఫౌండర్, ఆర్కిటెక్ట్ కావ్య పూర్ణిమ అన్నారు. ఆదివారం ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఏపీటీడీసీ, బ్లూ ఫ్లాగ్ సహకారంతో పూర్ణమిదం ఆర్గనైజేషన్, ఇండియన్ వైజాగ్ చాప్టర్ సంయుక్తంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు కలిసి పనిచేస్తే అందరికీ అనుకూలమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పెయింటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్గనైజేషన్ సభ్యులు